కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


పార్టీ జెండా ఆవిష్కరించిన మాధవరం కాంతారావు, కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు అన్నారు. మూసాపేట గూడ్స్‌షెడ్ రోడ్డులో పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ జెండాను కార్పొరేటర్ మహేందర్‌తో కలిసి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు శ్రీకర్‌రావు, తూము శైలేష్‌కుమార్, గుండాల వినోద్ కుమార్, ఐలయ్య, పిట్ల మనోహర్, రవికుమార్, పోలాకి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా కృషి

మోతీనగర్: బబ్బుగూడలో రెయిన్ వాటర్ సమస్య, దాని పరిష్కార పనులను గురువారం మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో బోడ శ్రీనివాస్, ఎర్ర స్వామి, వెంకటేష్, రాజ్‌కుమార్, సుందర్‌రావు, సద్గుణ రెడ్డి, రమేష్ నాయర్, శోభ రాజన్, పండుగ జానకి, రాజేశ్వరి, రాధిక, వాసవి, శ్రీకాంత్, వెంకట్, కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

స్క్రాప్ దుకాణంలో అగ్నిప్రమాదం

- సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం
- పక్క కంపెనీలోకి అంటుకున్న మంటలు పోలీసులకు ఫిర్యాదు



మూసాపేట: కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఓ స్క్రాప్ దుకాణంలో గురువారం అర్ధరాత్రి 2 గంటలకు విద్యుదాఘాతంతో అగ్ని ప్రమాదం జరిగింది. విద్యుత్ వైర్లు, ప్లాస్టిక్ పైపులతో పాటు వైర్లను కాల్చి కాపర్‌ను సేకరిస్తారు. అగ్ని ప్రమాదంతో ఒక్కసారిగా మంటలు అంటుకోవటంతో పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న కూకట్‌పల్లి అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని ఫైర్ ఇంజన్‌ల సహాయంతో మంటలను అదుపులోకి తెచ్చారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, సనత్‌నగర్‌ల నుంచి ఫైర్‌ఇంజన్‌లు వచ్చాయి. ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని, సుమారు 10 లక్షల రూపాయల ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు అంచనా వేశారు. అదే విధంగా పక్కనే ఉన్న మరో కంపెనీలోకి కూడా మంటలు వ్యాపించి ఆస్తి నష్టం జరిగింది. రా మెటీరియల్స్, మెషినరీ, కంప్యూటర్లు, ఎలక్ట్రిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. సుమారు కోటి రూపాయల పైనే ఆస్తి నష్టం జరిగిందని కంపెనీ యజమాని కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

సన్న బియ్యం పంపిణీలో కేంద్రం వాటా


సన్నబియ్యం అందజేస్తున్న వడ్డేపల్లి రాజేశ్వరరావు తదితరులు

కూకట్‌పల్లి: బీజేపీ బస్తీ బాట కార్యక్రమంలో భాగంగా డివిజన్ పరిధిలోని శ్రీశ్రీనగర్ బస్తీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు గురువారం పర్యటించారు. బస్తీలోని హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బస్తీలో ఉన్న రేషన్ షాపులో ఆహార ధాన్యాల పంపిణీని సందర్శించి అక్కడికి వచ్చిన ప్రజలకు.. ప్రధానమంత్రి గరీబ్ అన్న కళ్యాణ్ యోజన కేంద్ర ప్రభుత్వం పథకం ద్వారా అందజేస్తున్న సన్న బియ్యం పంపిణీ చేశారు. నెలకు ఒకొక్కరికి 5 కిలోల ఆహార ధాన్యాలు కేంద్ర ప్రభుత్వ వాటాగా అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శంకర్ రెడ్డి, సీనియర్ నాయకులు రమేష్, డివిజన్ అధ్యక్షుడు డాక్టర్ కిరణ్ కుమార్, డివిజన్ నాయకులు శ్రీశైలం, వాణి నాయుడు, నాగరాజు, అనిల్, విజయ్, రాజు, రమేష్, ప్రసాద్, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం @ 11 కేంద్రాలు

ఈ నెల 14 వరకు దరఖాస్తుల స్వీకరణ | కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో 639, మూసాపేట సర్కిల్ పరిధిలో 509 దరఖాస్తులు



మూసాపేటలోని వార్డు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

మూసాపేట: నిరుద్యోగ యువత వ్యాపారం చేసుకోవాలనుకునే వారికి ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం ద్వారా రాయితీతో కూడిన రుణాలను అందించనుంది. ఇప్పటికే కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలో 639, మూసాపేట సర్కిల్ పరిధిలో 509 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. కూకట్‌పల్లి జంట సర్కిల్ పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకంలో భాగంగా దరఖాస్తులు ప్రత్యేక కౌంటర్లలో స్వీకరిస్తున్నారు. కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిళ్ల పరిధిలో 11 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలలో ప్రాజెక్టు అధికారుల పర్యవేక్షణలో కమ్యూనిటీ ఆర్గనైజర్‌లు వార్డు కార్యాలయాల వారీగా రాజీవ్ యువ వికాస పథకం దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. కొంతమంది ఆన్‌లైన్‌లో నమోదుచేసి వార్డు కార్యాలయంలో ఉన్న అధికారులకు దరఖాస్తు ఫారంను అందజేస్తున్నారు. మరి కొంతమంది వార్డు కార్యాలయంలోనే నేరుగా అధికారులకు దరఖాస్తు ఫారాలను అందజేస్తున్నారు. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఆయా కౌంటర్లలో దరఖాస్తు ఫారాలను అందజేయవచ్చని అధికారులు తెలిపారు.

సర్కిళ్ల వారీగా ప్రత్యేక కౌంటర్లు

కూకట్‌పల్లి సర్కిల్ పరిధిలోని ఓల్డ్ బోయిన్‌పల్లి చివరి బస్టాప్ వద్ద ఉన్న ఓల్డ్ బాలానగర్ రాజు కాలనీ, కూకట్‌పల్లి ప్రభుత్వ పాఠశాల సమీపంలో, కూకట్‌పల్లి బాగ్ అమీర్‌లో, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ వార్డు కార్యాలయం పరిధిలో ప్రత్యేక కౌంటర్లు ఉన్నాయి. అదే విధంగా సర్కిల్ పరిధిలో కేపీహెచ్‌బీ కాలనీలో, బాలాజీనగర్, అల్లాపూర్, మోతీనగర్, ఫతేనగర్‌లోని వార్డు కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత అధికారులు అందుబాటులో దరఖాస్తులను స్వీకరిస్తున్నారు.

కుటుంబంలో ఒక్కరికి మాత్రమే అవకాశం

రేషన్ కార్డులో ఉన్న ఒక సభ్యునికి మాత్రమే అవకాశం ఉంటుంది. రేషన్ కార్డులేని వారు ఆదాయ ధ్రువీకరణ పత్రాన్ని కూడా జతచేసి దరఖాస్తు ఫారం అందజేయవచ్చు. 21 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల వయస్సు ఉన్నవారు ఈ పథకానికి అర్హులు.

ఉపాధి అవకాశం

నిరుద్యోగ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం 75 రకాల దుకాణాల ఏర్పాటుకు అవకాశం కల్పించింది. పంపుసెట్లు, ఎయిర్ కంప్రెషర్, ఆవులు, గేదెలు, చేపల పంపకం, పాల వ్యాపారం, ఫౌల్ట్రీఫారం, బేకరీ, హెయిర్ కటింగ్ షాపు, బ్యూటీ పార్లర్, ఎలక్ట్రికల్ షాప్, జనరల్ స్టోర్, గిఫ్ట్ ఆర్టికల్ షాప్, ఐస్‌క్రీమ్ పార్లర్, మినీ సూపర్ బజార్, చీరల వ్యాపారం, స్వీట్ షాప్ ఇలా 75 రకాల షాపులు ఏర్పాటుకు అవకాశం ఉంటుంది. ఈ పథకంలో లబ్ధిదారులకు 60 నుంచి 80 శాతం వరకు రాయితీతో కూడిన రుణాలను ప్రభుత్వం అందిస్తుంది.

> **దరఖాస్తుల స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు**
>
> సర్కిల్ పరిధిలోని ప్రతి డివిజన్‌లోని వార్డు కార్యాలయంలో దరఖాస్తు స్వీకరణకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశాము. అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ దరఖాస్తుల స్వీకరిస్తున్నారు. ఈ నెల 14వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ దరఖాస్తులు చేసుకోవచ్చు.
>
> – వంశీకృష్ణ, మూసాపేట సర్కిల్ ఉప కమిషనర్

నేడు 'డయల్ యువర్ డీఎం'

మూసాపేట: కూకట్‌పల్లి ఆర్టీసీ డిపోలో 'డయల్ యువర్ డీఎం' నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ హరి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటామని, ప్రయాణికుల సమస్యలు పరిష్కరించటమే కాక సలహాలు, సూచలను స్వీకరిస్తామన్నారు. ఫోన్ నెంబర్ 9959226151లో సంప్రదించాలని కోరారు.

మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

బాలానగర్: తెలంగాణ బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ మహాసభలు ఈ నెల 21, 22 తేదీల్లో శంషాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో జరుగనున్నాయి. గురువారం కూకట్‌పల్లి మండలం శ్రీశ్రీ నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయం వద్ద మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ, భవన నిర్మాణ సంఘం మండల కార్యదర్శి ఎం. దావీద్, నాయకులు రాజు గౌడ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

- కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు


కాలనీలో అధికారులతో కలిసి సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ శ్రీనివాసరావు

ఆల్విన్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని హెచ్‌ఎంటీ శాతవాహన కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు అన్నారు. డ్రైనేజీ పైపులైన్ పనులను ఇరిగేషన్ విభాగం, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రైనేజీ లైన్ పనులను లెవెల్ కలిసేలా చూడాలని, దోమల నివారణ కోసం డ్రోన్ సాయంతో పిచికారీ చేయించాలని అధికారులను కోరారు. కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ లక్ష్మీ నారాయణ, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నాలా విస్తరణ పనులను క్వాలిటీ కంట్రోల్ టీమ్ పరిశీలన


వి. రామారావునగర్‌లో నాలా అదనపు పనులను పరిశీలిస్తున్న బృందం

మోతీనగర్: మూసాపేట, అల్లాపూర్ డివిజన్‌లలోని పలు బస్తీ కాలనీల్లో, ఇళ్ల మధ్యలో ఉన్న ఓపెన్ నాలా పనులను క్వాలిటీ కంట్రోల్ టీం బృందం గురువారం పరిశీలించింది. అల్లాపూర్ డివిజన్ వి.రామారావు నగర్‌లో అదనంగా నాలా విస్తరణ పనులు చేపట్టాలని, మూసాపేట డివిజన్ అవంతినగర్ తోట, స్నేహపురి కాలనీల్లో కూడా నాలా అదనపు పనుల కోసం పరిశీలించారు. అనంతరం క్వాలిటీ కంట్రోల్ టీం ఈఈ రాజు మాట్లాడుతూ.. నాలా అదనపు పనుల కోసం ప్రణాళికలు సిద్ధం చేసి సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరయ్యే విధంగా కృషి చేస్తామని తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే నాలా అదనపు పనులతో పాటు ప్రస్తుతం కొనసాగుతున్న పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకురావడానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో డీఈ సంతోష్, స్రవంతి, ఏఈలు వర్షిని, రంజిత్, బీఆర్ఎస్ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు నాగుల సత్యం తదితరులు పాల్గొన్నారు.

పీఎస్ఎస్ఎం ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కాంతారావు తదితరులు

కూకట్‌పల్లి: పీఎస్ఎస్ఎం ధ్యాన భాగ్యనగర్ వింగ్ ఆధ్వర్యంలో గురువారం కూకట్‌పల్లి ఆర్టీసీ బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి మాధవరం కాంతారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలం పాదచారులకు, వివిధ పనుల నిమిత్తం ప్రయాణించే ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు దోహదపడతాయన్నారు. ప్రతి సంవత్సరం ప్రజల దాహార్తి తీర్చేందుకు పీఎస్ఎస్ఎం కమిటీ సభ్యులు చలివేంద్రాన్ని ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని, తన సంపూర్ణ సహకారం ఎల్లప్పుడు ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మల్లేష్, వినోద్‌గౌడ్, వేణు గోపాల్, సంతోష్, ప్రేమ్‌కుమార్, పీఎస్ఎస్ఎం సభ్యులు పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత పాటించాలి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి తదితరులు

బాలానగర్: బాలానగర్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్‌లో వీడీసీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి స్థానికులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, రాజీవ్‌గాంధీ నగర్ అసోసియేషన్ అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తా

- కార్పొరేటర్ సబిహా బేగం


కార్పొరేటర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీ వాసులు

మోతీనగర్: దశల వారీగా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ సబిహాబేగం అన్నారు. గురువారం గాయత్రినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు కృష్ణారావు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. వర్షం పడినప్పుడు ఇండోర్ స్టేడియం షటిల్ కోర్టులో పై కప్పు నుంచి వర్షపు నీరు కురుస్తుందని, ఫ్లోర్‌మాట్ కొత్తది వేయాలని, గాయత్రినగర్ 60 ఫీట్ రోడ్డులో డివైడర్‌పై గ్రిల్ నిర్మించాలని కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం మంచినీటి సమస్య గురించి ఆమె దృష్టికి తీసుకెళ్లగా.. అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

నేడు భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డొంగ్రీకర్ గురువారం తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్ నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులో ఉన్న పీఎఫ్ కార్యాలయంలో అదాలత్ ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

కాలనీ అభివృద్ధికి కృషి


భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్

మూసాపేట: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని సమతానగర్‌లో 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన మహిళా మండలి, కమ్యూనిటీ హాల్ భవనాన్ని గురువారం కార్పొరేటర్ సతీష్ గౌడ్‌తో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. స్థలం వివాదంలో ఉండగా వారితో చర్చించి పరిష్కరించటమే కాక ఎమ్మెల్యే నిధులతో కమ్యూనిటీ హాల్, మహిళా మండలి భవనాన్ని నిర్మించామని తెలిపారు. కాలనీలో మౌలిక వసతులను కల్పించి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో నాయకులు కంచి భిక్షపతి, సుదర్శన్ రెడ్డి, రాజేందర్, సతీష్, నర్సింహ, కన్నయ్య, సుధాకర్‌రెడ్డి, సత్యనారాయణ, లింగస్వామి, ప్రసాద్ పాల్గొన్నారు.

ట్రస్ట్‌కు రూ.5 లక్షల విరాళం


చెక్కు అందజేస్తున్న బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్ యాజమాన్యం తదితరులు

మోతీనగర్: సేవ చేయడానికి మనసు ఉండాలి గాని వయస్సుతో సంబంధం లేదని, మోతీనగర్ సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు సేవలో ముందుంటున్నారని బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్ ప్రతినిధి డాక్టర్ గుండాడ రాఘవేంద్ర రావు, చైర్మన్ బారాటం సత్యనారాయణ అన్నారు. ఇటీవల సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్ చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను వారు స్వయంగా సందర్శించి వార్షికోత్సవానికి కూడా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అక్కడ సేవలు పొందిన లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్ అందిస్తున్న సేవలను స్వయంగా గుర్తించి గురువారం ట్రస్ట్ ప్రతినిధులకు రూ.5 లక్షల చెక్కునందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి బి. సీతారామయ్య, బొండాడ ఇంజనీరింగ్ లిమిటెడ్ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, ట్రస్టీలు బైరెడ్డి సూర్యనారాయణ, పాశం ఆది సూర్య నారాయణ మూర్తి, గుంటపల్లి ఉమా మహేశ్వర రావు, జుట్ల రవీంద్రనాథ్ ఠాగూర్, రావుల శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

'బాగా చదవండి.. లక్ష రూపాయలు గెలవండి'


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, దొరబాబు తదితరులు

కూకట్‌పల్లి: ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ 10వ తరగతి పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి ఆలివ్‌మిఠాయి దొర రాజు లక్ష రూపాయలు అందజేస్తున్నారు. 10/10 వచ్చిన నియోజకవర్గంలోని విద్యార్థులకు ఇస్తున్నారు. అదే విధంగా ఈ సంవత్సరం కూడా అదే రీతిలో అందించడానికి 'బాగా చదవండి లక్ష రూపాయలు గెలవండి' అనే బ్రోచర్‌ను ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలివ్ మిఠాయి దొరరాజు విద్యార్థుల్లో మోటివేషన్ తీసుకువచ్చి వారి భవిష్యత్‌కు భరోసా ఇవ్వడమే కాకుండా ప్రతి సంవత్సరం వారి తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు బాగా చదివి నగదు బహుమతి పొందాలని సూచించారు.

సన్నబియ్యంతో భోజనం

ఆల్విన్‌కాలనీ: తెలంగాణలో పేదల ఇళ్లలో సంతోషాన్ని నింపే విధంగా సన్నబియ్యాన్ని కూడా తినాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని రంగారెడ్డి డీసీసీ ఉపాధ్యక్షురాలు విద్యాకల్పన ఏకాంత్ గౌడ్ అన్నారు. వివేకానందనగర్ డివిజన్‌లోని వేంకటేశ్వర నగర్‌లోని లబ్ధిదారుల ఇంట్లో ప్రభుత్వం అందజేసిన సన్నబియ్యంతో భోజనం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి జితేందర్, నాయకులు సంపంగి యాదగిరి, మహిళా కాంగ్రెస్ నియోజకవర్గ కార్యవర్గ సభ్యురాలు శాలిని జితేందర్, యూత్ కాంగ్రెస్ నాయకుడు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- అమృత్‌నగర్ తండాలో పర్యటన


తండాలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్ సతీష్‌గౌడ్ తదితరులు

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని అమృత్‌నగర్ తండా వాసులకు డబ్బుల్ బెడ్ రూమ్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు డిమాండ్ చేశారు. కార్పొరేటర్ సతీష్‌గౌడ్‌తో కలిసి తండాలో గురువారం పర్యటించారు. గతంలో 127 డబుల్ బెడ్రూంలకు గాను 69 మందికి డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరయ్యాయని, మిగతా 58 మందికి కూడా డబుల్ బెడ్రూంలు ఇప్పించాలని స్థానికులు కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పేద ప్రజలపై చిత్త శుద్ధితో డబుల్ బెడ్రూం ఇళ్లు పేదలకు లక్కీ డీప్ ద్వారా మంజూరు చేయటం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అటువంటి చర్యలు ఏమీ తీసుకోకుండా కాలయాపన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అతి త్వరలో జీహెచ్ఎంసీ కమిషనర్‌తో మాట్లాడి డబుల్ బెడ్రూం ఇళ్లు ఇప్పించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అమృత్‌నగర్ తండా వాసులు కూడా నాయక్, ముత్య నాయక్, మోహన్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు భిక్షపతి, సుదర్శన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసంలో అవకాశం కల్పించాలి

కూకట్‌పల్లి: రాజీవ్ యువ వికాసం పథకంలో కొన్ని కులాలకు చోటు కల్పించకపోవడం దురదృష్టకరమని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో క్షత్రియ కులస్తులు పెద్ద సంఖ్యలో నివాసం ఉన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు చేసుకునే అవకాశం లేకపోవడంతో వారి ఆవేదనను ఎమ్మెల్యే వద్ద వ్యక్తం చేశారు. దీంతో ఆయన జీహెచ్ఎంసీ పరిధిలో రాజీవ్ యువ వికాసం పథకంలో క్షత్రియులకు కూడా అవకాశం కల్పించేలా తగిన ఆదేశాలను జారీ చేయాలని కమిషనర్‌ను కోరారు.

రెచ్చిపోతున్న గంజాయి గ్యాంగ్

చందానగర్ : చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోజురోజుకు గంజాయి గ్యాంగ్ ఆగడాలు పెరిగిపోతున్నాయి. చందానగర్ పరిధి ఇంద్రనగర్‌లో గురువారం రాత్రి బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులపై గంజాయి సేవించిన కొంతమంది యువకులు కర్రలతో దాడి చేశారు. ఆ యువకులకు తీవ్ర గాయాలు కావడంతో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. గాయపడ్డ యువకులు చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పలు కాలనీలలో గంజాయి తాగి యువకులు నిత్యం బస్తీలలో దాడులకు పాల్పడుతున్నారని స్థానికులు వాపోయారు.

చందానగర్ ఎస్‌హెచ్‌ఓగా విజయ్



చందానగర్ : చందానగర్ పోలీస్‌స్టేషన్ నూతన ఎస్‌హెచ్‌ఓగా సుంకరి విజయ్ గురువారం రాత్రి బాధ్యతలు తీసుకున్నారు. ఇప్పటి వరకు విధులు నిర్వహిస్తున్న పాలవెల్లి సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వెళ్లగా పేట్ బషీరాబాద్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ విజయ్ బదిలీపై వచ్చారు.